## క్లుప్తంగా

### ఘనంగా చండీహోమం



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ విజయలక్ష్మి, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రాల నడుమ వెండి, బంగారు పుష్పాలతో అర్చన, హోమం, పూజాదికాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### రీసర్వే పనులపై ఆర్డీఓ సమీక్ష



కట్టమూరులో రీ-సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: మండలం కట్టమూరులో జరుగుతున్న రీ-సర్వే పనులను ఆర్డీఓ కె.శ్రీ రమణి బుధవారం పరిశీలించి రీ-సర్వే బృందాలతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ పనులు పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియ ద్వారా భూ సంబంధిత రికార్డులను సరిదిద్దడం, భూ యాజమాన్య వివరాలను స్పష్టం చేయడం లక్ష్యంగా ఉందన్నారు.

### నేడు శ్రీపుష్పయాగం

పిఠాపురం: పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురం కుంతీ మాధవస్వామివారి శ్రీపుష్పయాగం గురువారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్.శ్రీరాములు తెలిపారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు గురువారం నిర్వహించే శ్రీపుష్పయాగంతో ముగుస్తాయని చెప్పారు. కాగా బుధవారం ఉదయం ఉప్పాడ సాగరతీరంలో స్వామి వారి చక్రస్నానం నిర్వహించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చోరసంవాదం, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

పిఠాపురం: పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడులోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు బుధవారం పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ తెలిపారు. బి.ప్రత్తిపాడుకు చెందిన ఆకుల గంగరాజు ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి సుమారు 3 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడిలో పౌరసరఫరాల శాఖ తాహసీల్దార్ అనిల్‌కుమార్, డీటీ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో యాతం ప్రతిభ



యాతం నాగబాబును అభినందించిన ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: రాజస్థాన్ రాష్ట్రంలో ఆళ్వార్ మహానగరంలోని రాజర్షి కళాశాల స్పోర్ట్సు స్టేడియంలో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ చాపియన్ షిప్ మీట్‌లో సామర్లకోటకు చెందిన యాతం నాగబాబు ఆరు పతకాలను సాధించారు. ఈ నెల 6 నుంచి 8 వరకు జరిగిన పోటీల్లో పతకాలు సాధించిన ఆయనను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప బుధవారం అభినందించారు. వేట్లపాలెం పీహెచ్‌సీలో పని చేసిన నాగబాబు ప్రస్తుతం కాకినాడ జిల్లా మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్నారు. స్థానిక క్రీడాకారులు చల్లా బుజ్జి, అడబాల కుమారస్వామిలు నాగబాబును అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో పరిచయం చేశారు. జాతీయ పరుగు పందెం పోటీల్లో 100, 200, 400, 800 మీటర్లలో మూడో స్థానంలో నిలిచి నాలుగు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. అలాగే 4-400 మీటర్ల రిలే పరుగు పందెంలో బంగారు పతకం, 4-100 మీటర్ల రిలే పరుగు పందెంలో రజత పతకాలను సాధించారు. ఉద్యోగుల విభాగంలో జరుగుతున్న ప్రతి పరుగు పోటీలోను నాగబాబు పాల్గొని ఇప్పటి వరకు సుమారు 600 వరకు పతకాలు సాధించడం సామర్లకోటకు ఎంతో గర్వంగా ఉన్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు.

# పిచికారీ.. ప్రాణాంతకం సుమా!

- రసాయన ఎరువుల వినియోగంలో అప్రమత్తత అవసరం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దాపురం: పంటలు సక్రమంగా పండి అధిక దిగుబడులు సాధించేందుకు ఎరువులు, పురుగు మందులను రైతులు విరివిగా ఉపయోగిస్తుంటారు. అయితే రసాయనిక ఎరువుల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరిస్తున్నారు. ఎరువుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- రసాయనిక మందు పిచికారీకి పరిశుభ్రమైన నీటిని వినియోగించాలి.
- తలకు టోపీ, ముఖానికి మాస్క్ ధరించాలి. ద్రవణాన్ని కలిపే మందు డబ్బాపై ఉన్న లేబుల్‌లో సూచించిన వివరాల ప్రకారం మందులు కలుపుకోవాలి.
- మందును కలిపేటప్పుడు తప్పనిరిగా కళ్లజోడు వినియోగించాలి. లేదంటే తుంపరలు కళ్లకు తగిలే ప్రమాదం ఉంది.
- ద్రవణాన్ని స్ప్రేయర్ పంప్‌లో వేసే ముందు పిచికారి చేసే సమయంలో బీడీలు, సిగరెట్, ఖైనీ వినియోగించరాదు.
- మందులను వాసన చూడకూడదు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.



వరి పొలంలో పిచికారీ చేస్తున్న రైతు

**పిచికారీ చేసే విధానం**

- పిచికారీ చేసే స్ప్రేయర్ నాణ్యత బాగుండాలి.
- ఎటువంటి లీకేజీలు ఉండకూడదు. స్ప్రేయర్ నాజిల్ సక్రమంగా ఉందో లేదో ముందుగా చూసుకోవాలి.
- పిచికారీ సమయంలో నాజిల్ సమస్య వస్తే నోటితో ఊదడం ప్రమాదకరం.
- గాలి ఎక్కువగా వీచేటప్పుడు ఎండ ధాటిగా తగులుతున్న సమయంలో మందులు పిచికారీ చేయరాదు. పిచికారీ సమయంలో గాలి వ్యతిరేక దిశలో స్ప్రేయర్ చేయకుండా వాలు దిశలో పిచికారి చేయాలి.
- మందులు కలిపిన డబ్బాలో నీరు పట్టుకుని తాగడం అత్యంత ప్రమాదకరం.

**అవగాహన కల్పిస్తున్నాం**



క్రిమి సంహారక మందుల పిచికారీ సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రతి రోజూ వ్యవసాయ సహాయకులు ఎల్‌ఈడీ స్క్రీన్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలిస్తున్నారు. పిచికారీ విధానానికి సంబంధించిన పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో కూడా అవగాహన కల్పిస్తున్నాం. రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– కె.సంజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏఓ, పెద్దాపురం

**డబ్బాలను భద్రపర్చాలి**

పిచికారీ పూర్తి అయిన తరువాత డబ్బాలను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదు. మందు డబ్బాలను కడిగి కాలువలు, నీటి కుంటల్లో పోయరాదు. మందు మిగిలిన డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచుకోవాలి. చిన్న పిల్లలు పశువులకు దగ్గరగా ఉంచడం చేయకూడదు.

### పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు



గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కాకినాడ ఎస్‌డీపీఓ పాటిల్ దేవరాజ్ మనీష్

పిఠాపురం: మీ సమస్య పరిష్కారం కాకపోతే నా దృష్టికి తీసుకురండి అని ప్రజలకు భరోసా ఇచ్చారు కాకినాడ ఎస్‌డీపీఓ పాటిల్ దేవరాజ్ మనీష్. గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. స్థానికంగా ఏ సమస్య పరిష్కారం కాకున్నా తన సెల్ నంబర్ 94407 96505ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉండి, వారికి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. గొల్లప్రోలు పోలీసు స్టేషన్లో ఉన్న పెండింగ్ కేసులు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన పోలీసులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య

పిఠాపురం: నియోజకవర్గంలోని భూమి గల ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు విశిష్ట సంఖ్యను కేటాయిస్తున్నట్టు పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పి.స్వాతి తెలిపారు. పిఠాపురం వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. దీని వల్ల రైతుకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. అర్హులైన భూమిగల రైతులు గుర్తించడంలో తోడ్పడి, వారు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు. భూ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ స్వాతి

ఆధారిత పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర పథకాలు నేరుగా పొందే వీలు కలుగుతుందన్నారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, రైతు గుర్తింపు సంఖ్యను పొందవచ్చన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకూ, భవిష్యత్‌లో కౌలు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తుల్లో ఉన్న వారికి ఇది వర్తిస్తుందని తెలిపారు. ఈ నెలాఖరు లోపు పిఠాపురం సబ్ డివిజన్ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిఠాపురం మండల వ్యవసాయ శాఖాధికారి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆకులో ఆహారం !

పిఠాపురం: అరటి ఆకులో అన్నానికి బదులు ఆకు కూరలు, విత్తనాలు ఉన్నాయి ఏమిటో అనుకుంటున్నారా ? నేటి విత్తనాలే రేపటి మన ఆహారం అని చెప్పడానికి ప్రకృతి వ్యవసాయ శాఖ చేసిన వినూత్న ఆలోచన ఇది. గొల్లప్రోలు మండలం దుర్గాడలో రైతులు, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందికి బుధవారం అధికారులు వినూత్న రీతిలో సెంద్రియ సాగుపై అవగాహన కల్పించారు. కాకినాడ జిల్లా డీపీఎం ఎలియాజర్ ఆధ్వర్యంలో అరటి ఆకులో ఆహార ధాన్యాలను వేసి, వాటిని భవిష్యత్తులో ఆహారంగా ఎలా తయారు చేసుకోవాలనే విధానాన్ని వివరించారు.



దుర్గాడలో అరటి ఆకులో ఆహార ధాన్యాలు వేసి శిక్షణ ఇస్తున్న దృశ్యం

# చురుగ్గా పైప్‌లైన్ మరమ్మతులు

- పనులను పరిశీలించిన కమిషనర్ శ్రీవిద్య
- ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు

సామర్లకోట: స్థానిక ఉండూరు రోడ్డులోని ఫిల్టర్ ప్లాంట్ వద్ద పాడైన ప్రధాన పైప్‌లైన్‌కు అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. సోమవారం నుంచి ఈ మరమ్మతులు సాగుతుండగా పనిలో పనిగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోని బెడ్‌లను సైతం శుభ్రం చేస్తున్నారు. ఈ ఫిల్టర్ ప్లాంటు నుంచే పైప్‌లైను ద్వారా గణపతినగరం, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న వాటర్ ట్యాంకులకు నీరు నింపి అక్కడి నుంచి నీటిని సరఫరా చేసేవారు. ఈ పైప్‌లైన్ పాడవడంతో మూడు రోజులుగా పట్టణ ప్రజలు తాగునీరు లేక సతమతమవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులను మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పరిశీలించారు. పైప్‌లైన్ మరమ్మతులు అయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీరు అందజేస్తామని ఏఈ రమేష్ తెలిపారు. మరో రెండు రోజుల వరకు పైప్‌లైన్ మరమ్మతులు ఉంటాయని ఇంజినీరింగ్ ఫిల్టర్ బెడ్ ఇన్‌చార్జి గిడుతూరి శ్రీనివాసు తెలిపారు.



ఫిల్టర్ బెడ్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటును పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీవిద్య తదితరులు

### వేర్వేరు అగ్నిప్రమాదాల్లో భారీ ఆస్తినష్టం

పెద్దాపురం: మండలంలోని మర్లావ, జె.తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం సాయంత్రం వేర్వేరుగా జరిగిన అగ్ని ప్రమాదాల్లో భారీ ఆస్తినష్టం సంభవించింది. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని మర్లావలో గ్యాస్‌బండ పేలడంతో గ్రామానికి చెందిన కోన సత్యకాంతం ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల నగదు, రెండు కాసుల బంగారు ఆభరణాలతో పాటు వస్తుసామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే మండలంలోని జె.తిమ్మాపురంలోలో అగ్నిప్రమాదం సంభవించడంతో సుమారు ఐదు కాసుల బంగారం, నగదుతో వెరసి ఐదు లక్షల రూపాయల మేర ఆస్తినష్టం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించి రెండు ఘటలనపై అగ్నిమాపకా శాఖను వివరణ కోరగా ప్రమాద సంఘటనపై అంచనాలు తెలిసిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.



మర్లావ అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన ఇల్లు

# తీరం.. భక్తజన హారం

- సముద్ర తీరంలో పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా ఉప్పాడ తీర్థం

కొత్తపల్లి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని పుణ్యస్నానాలు ఆచరించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఉప్పాడ సాగర తీరం బుధవారం జనసంద్రమైంది. వేలాది మంది భక్తులు ఉప్పాడ సాగర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. సంప్రదాయం ప్రకారం తెల్లవారుజామున పిఠాపురంలో వేంచేసిన కుంతీమాధవస్వామి (దొంగ దేవుడు)ని ఊరేగింపుగా పురోహితులు తీరానికి తీసుకువచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి చక్రస్నానం నిర్వహించారు. కాగా ఉదయం నుంచి వివిధ వాహనాలపై భక్తులు తరలిరావడంతో రద్దీ నెలకొంది. ఎక్కువ మంది భక్తులు సుబ్బంపేట తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉప్పాడ తీర్థం ఘనంగా జరిగింది. పిఠాపురం సీఐ శ్రీనివాస్‌ఆధ్వర్యంలో ఎస్సై రామలింశ్వరరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సుమరు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

**ఆలయాలకు భక్తుల తాకిడి**

పౌర్ణమి సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్తపల్లి మండలంలోని సాగర తీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు సమీపంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, బిక్కవోలు, పెద్దాపురం, కిర్లంపూడి, కాకినాడ రూరల్, తొండంగి మండలాల్లోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం కుంతీమాధవ స్వామిని ఊరేగింపుగా పిఠాపురం ఆలయానికి తీసుకువెళ్లారు.

పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులకు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పులిహోర, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

**అన్న సమారాధన**

మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఉప్పాడలోని గంగమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల పిండి వంటలతో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. సుమారు 3 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించి అన్నప్రసాదం స్వీకరించారు.

**పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు**

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారు జామున స్వామి వారికి అభిషేకాలు, పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారికి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

**భక్తి శ్రద్ధలతో చక్రస్నానం, పూర్ణాహుతి**

సామర్లకోట: మండలం వేట్లపాలెంలో కొలువైన వేంకటేశ్వర ఆలయంలో బుధవారంతో స్వామి వారి కల్యాణోత్సవాలు ముగిసాయి. ఈ నెల ఏడో తేదీన ప్రారంభమైన ఉత్సవాలు భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన స్వామివారి కల్యాణంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలను గోదావరి వద్దకు తీసుకువచ్చి చక్రస్నానం చేయించారు. అనంతరం పారిశ్రామిక వేత్త గోలి సోమేష్ ఆధ్వర్యంలో పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం గజవాహనంపై గ్రామోత్సవం, రాత్రి శ్రీపుష్ప యాగోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు, కమిటీ నాయకులు, భక్తులు సేవలందించారు.

ఈ కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల తొమ్మిదో తేదీన ప్రారంభించిన జిల్లా స్థాయి భజన పోటీలు బుధవారంతో ముగిశాయి.

**మాండవ్య నారాయణుని గ్రామోత్సవం**

సామర్లకోట: గోదావరి తీరంలో ఉన్న అతి పురాతన విష్ణు ఆలయమైన శ్రీ, భూ సమేత మాండవ్య నారాయణస్వామిని బుధవారం గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారు జామున స్వామి వారికి పంచామృతాభిషేకాలు, లక్ష తులసి పూజ, అమ్మవార్లకు కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గోలి వారి వీధి, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మ చెరువు, మఠం సెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా రాత్రికి గ్రామోత్సవం ఆలయం చేరింది.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారు



ఉప్పాడ సాగర తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కుంతీమాధవస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



సామర్లకోటలో సాగుతున్న మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం

## భక్తిశ్రద్ధలతో మాఘపౌర్ణమి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

పిఠాపురం: మాఘ పౌర్ణమి సందర్భంగా పిఠాపురం నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసిన ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు అమ్మవారికి పంచామృతాలు, హరిద్ర, కుంకుమ, సుగంధ జలాలతో అభిషేకాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రీసూక్త ,దుర్గాసూక్త, సహస్రనామ పారాయణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ రాజగోపురంపై, ధ్వజస్తంభంపై కనిపించిన చంద్ర దర్శనం భక్తులను ఆకట్టుకుంది. గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు



దుర్గాడ శివాలయం వద్ద చంద్ర దర్శనం



ఉప్పాడలో చక్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



దుర్గాడలో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



సామర్లకోటలో చక్రస్నానానికి హాజరైన భక్తులు



ప్రత్యేక అలంకరణలో దుర్గాడ లలితాదేవి అమ్మవారు